విశాలాంధ్ర



## ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తున్న వైసీపీ

విశాలాంధ్ర-డెంకాడ : ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ఐదు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా డేంకాడ మండలంలో చింతవలస గ్రామంలో రాజ శేఖర్ రెడ్డి విగ్రహాన్నికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్‌కటింగ్ చేసిన నెల్లిమర్ల నియోజకవర్గ శాసనసభ్యులు బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి నేటి వరకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ వస్తున్నారు కాబట్టే ఇంతకు ముందు జరిగిన ప్రతి ఎన్నికలను వైయస్సార్సీపి పార్టీని గెలిపిం చారని ఇక ముందు కూడా అదే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తారు కావున మీ గ్రామానికి తెలుగుదేశం పార్టీ వారు జనసేన పార్టీకి సంబంధించిన వారు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి మీకు అది చేస్తాం ఇది చేస్తామని చెప్పి నా మాటలను మీరు నమ్మవద్దని ప్రస్తుతం మీకు జగన్మోహన్ రెడ్డి మీకు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను మాత్రమే దృష్టిలో ఉంచుకోవాలని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి కార్యక్రమాలను చేస్తారని కావున ఎవరు ఎన్ని రకాల మాటలు చెప్పిన ప్రజలు మీకు ఎవరు అందుబాటులో ఉంటారో వారిని మళ్లీమళ్లీ గెలిపించుకుని జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేంకాడ మండల పరిషత్ అధ్యక్షులు బంటుపల్లి వాసుదేవరావు వైస్ ఎం.పి.పి. పిన్నింటి తమ్మి నాయుడు పిఏసిఎస్ అధ్యక్షులు పిన్నింటి సత్యరావు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జెసి రాజుకు రోటరీ పీహెచ్‌ఎఫ్ పురస్కారం

విశాలాంధ్ర-బొబ్బిలి: రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ స్థాపకుడు పాల్ హారీస్ పేరుపై వున్నా పాల్ హారీస్ ఫెలో పురస్కారాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు అందుకున్నారు. ఆదివారం విశాఖ పట్నం వైయస్సార్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం లో జరిగిన ఆర్ పి ఎల్ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏ ఎస్ కె భాస్కర్ రామ్ పీహెచ్‌ఎఫ్ పురస్కారాన్నిపాల్ హెరీస్ ప్రతిమతో ఉన్న పిన్ ను సర్టిఫికెట్ ను జెసి రాజుకు అందించారు. ఈ సందర్భంగా అస్సిస్టెంట్ గవర్నర్ తూముల కార్తిక్ మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ సేవావిభాగం అయిన రోటరీ ఫౌండేషన్ కు రూ.1000 డాలర్ల 80 వేలు విరాళాన్ని డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కర్ రామ్ సహకారంతో జె సి రాజు అందించారనిఅన్నారు. అలాగే రోటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్ననిర్వార్థమైనావిస్తృత సేవా కార్యక్రమాలకు రోటరీ ఇంటర్నేషనల్ పి హెచ్ ఎఫ్ పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ జి.శ్రీనివాసరావు, కేషనల్ ట్రైనింగ్ చైర్‌కిషోర్ కార్యదర్శి శ్రీహరి, కోసాదికారి శ్రీనివాసన్ పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు.

## స్వయం ఉపాధి వైపు మహిళల అడుగులు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: స్వయం ఉపాధి దిశగా మహిళల అడుగులు వేయాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్. రాజు అన్నారు. పేద మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కుట్టు యంత్రంలో (టైలరింగ్) ఉచిత శిక్షణ నిచ్చారు. ఇక్కడ రెండు బ్యాచ్ లలో శిక్షణ పొందిన వారికి శనివారం వీసీ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు చే ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ మహిళలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా వారి కాళ్లపై వారు నిలబడి ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుందన్నారు. బొండపల్లి, నెల్లిమర్ల మండలాల్లో ఇప్పటి వరకు ఉంపల్లి, ఎల్. ఎన్. పురం, చంద్రయ్య పేట, కోరాడపేట, కొండవెలగాడ తదితర గ్రామాల్లో మహిళలకు శిక్షణ నిచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్.ఎస్. వర్మ, డీన్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యరంగంలో మెరుగైన సేవలు : కలెక్టర్

### జాతీయ ఆరోగ్యమిషన్ బృందంతో భేటి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో వైద్యారోగ్యశాఖల పరంగా మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. జాతీయ ఆరోగ్యమిషన్ బృందంతో తన ఛాంబర్‌లో ఆదివారం భేటీ అయ్యారు. జిల్లాలో ప్రజలకు అందిస్తున్న వైద్యారోగ్య సేవలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. సర్వశిక్షా అభియాన్, పోషణ్ అభియాన్ తదితర కార్యక్రమాలను వివరించారు. వైద్యసేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రతీ శుక్రవారం వైద్యాధికారులు ఆసుపత్రులను సందర్శిస్తున్నారని అన్నారు. అలాగే పారిశుధ్యాన్ని మెరుగు పర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల్లో వివిధ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని, ఆడపిల్లలను కూడా డిగ్రీ వరకు చదివించేందుకు ప్రోత్సహిస్తున్నామని అన్నారు. వైద్య సేవలు మరింత మెరుగు పడనున్నాయని, ఇటీవలే జిల్లా కేంద్రాసుపత్రిని సర్వజనా సుపత్రిగా మార్పు చేశామని తెలిపారు. ప్రభుత్వ వైద్యకళాశాల అందుబాటులోకి వస్తే, మరిన్ని సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం అందిస్తున్న పోషకాహార పంపిణీని వివరించారు. బాలికలు, మహిళల సంరక్షణ కోసం సచివాలయాల ద్వారా ప్రతీ 2000 మందికి ఒక మహిళా పోలీస్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచడం జరిగిందని కలెక్టర్ వివరించారు.కలెక్టర్‌తో భేటీ అయిన వారిలో బృందం సభ్యులు డాక్టర్ రంజన్ కుమార్ ఛౌదురి, డాక్టర్ అంకుర్ నాయర్, విశాల్ కటారియా, డాక్టర్ విజయ్ రజనా, డాక్టర్ శ్వేతాశర్మ, డాక్టర్ మోనికా షైనీ, డాక్టర్ కె.శ్రీనివాస్‌తో పాటు, వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్ తోపాటు డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు, ఇతర అధికారులు ఉన్నారు.

## పంచారామా దర్శనానికి ఎస్.కోట నుంచి ఆర్టీసీ సర్వీసులు

### డిపో మేనేజర్ కె.రమేష్

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పంచారామాలు దర్శనానికి ఎస్.కోట డిపో నుంచి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. డిపో ఆవరణలో ఒక సూపర్ ఎక్స్ప్రెస్ బస్సును 49 మంది పూర్తి కెపాసిటీతో ఆదివారం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రోజు అయినా పిక్నిక్ లు, యాత్రలకు ఎస్.కోట డిపో నుండి అల్ట్రా డీలక్స్, ఎక్స్ప్రెస్, పల్లెవెలుగు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సదావకాశాన్ని అందరూ వినియోగించుకోవలసిందిగా డిపో మేనేజర్ కె.రమేష్ తెలియజేసారు. దేశంలోని శబరిమల, శ్రీశైలం, పంచారామాలు, ఇతర ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాల సందర్శనకు ఏపీ ఆర్టీసీ బస్సులు బుక్ చేరుకునే అవకాశం ఉందని డిపో మేనేజర్ కే.రమేష్ వివరించారు.

## జై భీమ్ భారత్ పార్టీ గజపతినగరం నియోజకవర్గ ఇన్చార్జిగా "కొత్తలి"

విశాలాంధ్ర-జామి: జై భీమ్‌భారత్ పార్టీ తరఫున గజపతినగరం నియోజకవర్గ ఇన్చార్జిగా మానవ హక్కుల సంఘాల జిల్లా ప్రతినిధి కొత్తలి గౌరి నాయుడు నియమితులయ్యారు. జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రావణ్‌కుమార్ ను గౌరినాయుడు ఆ పార్టీ నాయకులు ఏనుగు బిల్లి కృష్ణ సమక్షంలో శుక్రవారం విజయవాడలో గల జై భీమ్ భారత్ పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్తలి గౌరి నాయుడు పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని జడ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం నియోజకవర్గ ఇన్చార్జిగా కొత్తలిగౌరి నాయుడుకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కొత్తలి గౌరినాయుడు ఆదివారం మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ ప్రజలను సమాజంలో బలోపేతం చేసేందుకు జడ శ్రావణ్ కుమార్ జై భీమ్ భారత్ పార్టీని స్థాపించారని అన్నారు. సమాజంలో పేద, బడుగు,బలహీన, అణగారిన వర్గాలకు చెందిన ప్రజలకు జడ శ్రావణ్ కుమార్ అండగా ఉంటూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని కొనియాడారు. చట్టాలపై, భారత రాజ్యాంగంపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తి జడ శ్రావణ్ కుమారని, అలాంటి వ్యక్తి రాజ్యాధికారాన్ని సాధిస్తే ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ ప్రజల కలలు సాకారమౌతాయని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తెలిపారు. గౌరి నాయుడు గజపతి నగరం నియోజకవర్గం ఇన్చార్జిగా నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసారు.

## కొటారుపల్లి కూడలిలో వైసిపి ఐదేళ్ల పాదయాత్ర సంబరాలు

విశాలాంధ్ర-గంట్యాడ: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మహా సంకల్పయాత్ర పాదయాత్ర చేసి నేటికీ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం గంట్యాడ ఎంపీపీ పీరు బండి హైమావతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ కొటార్ పల్లి కూడలిలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి కార్యకర్తలతో కలిసి కేకు కట్ చేసి నివాళులర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి సీఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేశారని ప్రజా సమస్యలపై తిరిగి లేని పోరాటాలు చేయడం వల్లనే తిరుగులేని మెజారిటీ సాధించి సీఎం పదవి అధిరోహించారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 90 శాతం వరకు హామీలు నెరవేర్చారని కుల మత బేధాలు లేకుండా లంచాలకు తావు లేకుండా అర్హత ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారన్నారు వాలంటీర్ వ్యవస్థ సచివాలయ వ్యవస్థలు ప్రవేశపెట్టి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చారని అన్నారు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి ప్రజా ప్రతినిధులను ప్రజల వద్దకు పంపించి ప్రజా సమస్యలను పరిష్కరించమంటున్న నాయకులు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కొండలరావు సర్పంచ్ ముత్యాల నాయుడు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపులు ఆకస్మికంగా తనిఖీ

విశాలాంధ్ర-భోగాపురం: మద్యాన్ని బెల్ట్ షాపులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ నరసింహ రాజు అన్నారు. ఆదివారం మండలంలో తోటపల్లి, రెడ్డికంచెరులోమద్యం దుకాణాలను ఆకస్మికంగా గా తనిఖీచేసారు. మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నసిబ్బంది పనితీరును పరిశీలించారు. మద్యాన్ని ఎం ఆర్ పి రేటు కన్నా ఎక్కువగా అమ్మినా, బెల్ట్ షాపులకు విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటాము అన్నారు. ఆయనతో పాటు ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్సా ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవసదన్ లో అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం రూరల్. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రోత్సాహంపై నల్సా ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవసదన్ లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి సాయి కళ్యాణ చక్రవర్తి ముఖ్య అతిదిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనిని ప్రతి విద్యార్థి తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, అమ్మఒడి తదితర పథకాలను అందిస్తూ, ప్రతీ ఒక్కరు బడికి వెళ్ళేలా ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. అంతకుముందు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను ఆయన ప్రారంభించారు.

## ఓటర్ల చేర్పులు వేగవంతం

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లు చేర్పించుట కొరకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు ఓటర్ లిస్టును పరిశీలించారు గ్రామస్థాయి నాయకులు సలహాలు సూచించారు ఈ సందర్భంగా సోమవారం తో పట్టభద్రుల ఓటర్లు చేర్పుటకు ఆఖరి తేదీ కనుక ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటర్లను ను ఎక్కువ స్థాయిలో చేర్పించాలని కోరారు ఈ కార్యక్రమం లో డెంకాడ మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు మాజీ ఎంపీటీసీ ఆదిబాబు గ్రామ పార్టీ అధ్యక్షులు బొప్పాయి గురునాయుడు పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య పూర్వీకుల సేవాస్ఫూర్తిని మరింత ఇనుమడింపచేయాలి

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ఆర్యవైశ్య పూర్వీకుల సేవ స్ఫూర్తిని మరింత ఇనుమడింప చేయాలని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆదివారం నాడు విజయనగరంలోని ఎస్ వి యన్ నగర్ లోని సుజాత కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన అవోపా విజయనగరం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల రాక సందర్భంగా నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అవోపా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన బండారు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి తవ్వా మోహనరావు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యనారాయణ, కమిటీ సభ్యులను శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. సందర్భంగా వధూవరుల వివాహ పరిచయ వేదిక సావనీర్ ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అంటేనే సేవా రంగాల్లో ముందు ఉంటారని భావన సమాజంలో నెలకొందని అన్నారు. పూర్వీకుల ద్వారా వచ్చిన సేవా భావన, పేరు ప్రఖ్యాతులు నేటి తరం కూడా కొనసాగే విధంగా చూడాలన్నారు. ఆర్య వైశ్యులు సంఘటిత శక్తిగా ఎదగాలని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో గడచిన మూడేళ్లలో వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేవని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కోలగట్ల వీరభద్రస్వామికి శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు తటవర్తి రాంబాబు, ఆరవేటి నిర్మల, ప్రగలపాటి కనకరాజు, ఆరిశెట్టి గున్నయ్య గుప్తా, బండారు బంగారు రాజు, కార్పొరేటర్లు బండారు ఆనంద్ బాబు, వజ్రపు గౌరి, కుమ్మరి గుంటశ్రీనివాసరావు, వెచ్చ సత్యనారాయణమూర్తి, కొల్లిపర రామ నాగ సత్యనారాయణ జిల్లా నలుమూలల నుండి పెక్కుసంఖ్యలో ఆర్యవైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

### గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో గల విశాఖ గ్రామీణ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజరు పెదిరెడ్ల అభినవ్ మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించేందుకు విజిలెన్స్ శాఖను ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే ఎక్కడైనా లంచం వంటి అవినీతి జరిగినచో విజిలెన్స్ అదికారులాకు సమాచారమిచ్చి అవినీతిని నిర్మూలించాలని సూచించారు.అనంతరం వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ఆయన చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది వాగ్దేవి రామ లక్ష్మి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

విశాలాంధ్ర-గజపతినగరం: గజపతినగరంలోని ఆల్తి వారి కళ్యాణ మండపంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడు తూ పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు. ప్రజా వ్యతిరేక తను ప్రజలకు తీసుకొని వెళ్ళాలని పిలుపు నిచ్చారు అనంతరం అక్కడినుండి ఇప్పటం ఇల్లు కూల్చివేతపైజనసేన పార్టీ నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై నిరసన తెలియజేశారు. ఈ నిరసన సభకు స్థలం ఇస్తే గ్రామాన్ని నాశనం చేస్తారా అని ప్రశ్నించారు. కేవలం కక్ష సాధింపు కారణంగానే ఇల్లులు కూల్చి వేశారని ఆరాపించారు. ప్రజలను పరామర్శించడానికి పవన్ కళ్యాణ్ పాస్పోర్ట్ తీసుకుని వెళ్లాలా అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి కక్ష సాధింపు చర్యలు మానుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మిడతాన రవికుమార్, కలిగి పండు, రాము తదితరులు పాల్గొన్నారు.



## నేడు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర-బెలగాం : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో తే07.11.22దీ సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమ సందర్భంగా ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధరల చట్టభద్ధత చేయాలని, ఖరీఫ్ దాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా రైతుల నుండి కొనుగోలు చేయాలని, రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం వలే క్వింట ధాన్యానికి రూ.2800/- ఇవ్వాలని, ప్రకృతి వైపరీత్యాలు వలన నష్టపోయిన జీడిపంటకు పరిహారం గిరిజన రైతులకు ఇవ్వాలని, లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే స్వాధీనపరచుకొని తెరవాలని, డిమాండ్ల సాధన కోసం సోమవారం ఉదయం 10.30కు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి అనంతరం ధర్నా జరుగుతుందని, కావున రైతు సోదరులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆశ్రమం పిల్లలకు నిత్యావసరాలు



విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటీ చైర్మన్ డా "మంచపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో పార్వతీపురం, భారత్ భవన్ వీధి వాస్తవ్యరాలు కీర్తిశేషులు రెడ్డి బుచ్చమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా ఆమె కుమార్తె లక్ష్మి మరియు అల్లుడు పోలిరాజు ఆదివారం పార్వతీపురం, కొత్తవలస చివరన ఉన్న ఆశాజ్యోతి ఆశ్రమంలో పిల్లలకు కొరకు కిరాణా సామాన్లు మరియు బియ్యం బస్తాను అందజేశారు. ఈ కార్యక్ర మంలో పార్వతీపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు బోటు రామక్రిష్ణ గారు మరియు, జిల్లా కో ఆర్డినేటర్ సీరియల శ్రీనివాసరావు గారు పాల్గొనటం జరిగింది.

## మానవత్వం చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో రెగ్యులర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఐ.ఎస్.రావు తన మానవత్వాన్ని నిరూపించుకున్నారు. ఆదివారం పార్వతీపురం నుంచి విశాఖపట్నం నకు వెళ్తున్న బస్సులో ఒక మనీ పర్సు ప్రయాణికులు మరిచిపోయి వెళ్ళిపోయారు. డ్రైవర్ ఆ పర్సులో ఉన్న నగదును గుర్తింపు కార్డులను చూసి ఆధార్ కార్డు లో ఉన్న చిరునామా ఆధారంగా ఆన్లైన్లో ఆధార్ కార్డు వెరిఫై చేసి అందులో ఉన్న ఫోన్ నెంబర్ కు డ్రైవర్ ఫోన్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రయాణికుడు గోపాల శెట్టి సురేష్ డిపోకు వచ్చి తాను పర్స్ పోగొట్టుకున్న విషయాన్ని అధికారులు తెలియజేశారు. దీంతో డ్రైవర్ ఐ ఎస్ రావు తనకు దొరికిన పర్సును అందులో ఉన్న 4270 రూపాయల నగదును పలు గుర్తింపు కార్డులను అందజేసి మానవత్వం చాటుకున్నారు. డ్రైవర్ ఐ ఎస్ రావును డిపో మేనేజర్ కనకదుర్గ ఎస్ టి ఐ రామారావు ఏఎస్ రావు సహచర సిబ్బంది అభినందించారు.

## ఏనుగులను ఇక్కడ నుండి తరలించేది ఉందా?



విశాలాంధ్ర-సీతానగరం: మన్యం జిల్లాలో సీతానగరం మండలంలోని అనంత రాయుడుపేట గ్రామానికి దగ్గరలో పంట పొలాల్లో వారంరోజుల నుండి తిష్టవేసి పంటను త్రొక్కి పెడుతున్న ఏనుగుల గుంపును ఇక్కడనుండి తరలించి పంటలను కాపాడాలని సీతానగరం, అనంత రాయుడుపేట, చినభోగిలి గ్రామ రైతులు కోరుతున్నారు. గతవారం రోజుల నుంచి ఒకేదగ్గర తిష్టవేసి వరిని కుమ్ముతూ, చెరకు, అరటి, పామాయిల్ పంటలను నాశనంచేస్తున్నాయని పలువురురైతులు లబోదిబో మంటున్నారు. రైతులు పంటల వద్దే నిరీక్షణచేస్తూ తమపంటలవైపు రావద్దని భగవంతుడిని, అక్కడఉండే అటవీశాఖ సిబ్బందిని ప్రాధేయ పడుతున్నారు.ఆదివారం ఏనుగులు ఉండే పొలంవద్ద వరిపంటను అనంత రాయుడుపేట మహిళలు, రైతులు కోస్తుండగా ఒక్కసారి ఏనుగులు రావడంతో కొంతసేపు ఆపాల్సి వచ్చింది. ఆసమయములో రైతులు అటవీ సిబ్బంది వద్ద తమగోడును వెళ్ళబుచ్చారు. ఏనుగులు గుంపుగా వస్తున్న సమయంలో వాటిని చూసి పరుగులు పెడుతున్నారు. రైతులకే కాదు వాటికి కాపలా కాస్తున్న సిబ్బందికి కూడా ఇబ్బందులు తప్పడంలేదు. అవి ఎప్పుడు ఎక్కడనుండి ఎక్కడకు వెళ్తాయన్నది వారికి తెలియని పరిస్థితి ఉందని అంటున్నారు. ఇక్కడవాతావరణం వాటికి అనుకూలంగా ఉందన్నది స్పష్టంగా తెలుస్తోంది. కొంతసేపు పంటలుతింటూ, మరికొంత సేపు నాశనం చేస్తూ, కొంతసేపు విశ్రాంత తీసుకొంటూ, మరికొంతసేపు సువర్ణముఖి నదికి వెళ్లి దాహార్తిని తీసుకుంటున్నాయి. ఉదయం,సాయంత్రం, రాత్రిపూట అనంతరాయుడుపేట రోడ్డుపై తిరుగుతూ ఉంటున్నాయి. ఇది వాటి దినచర్యని గత వారంరోజులుగా దగ్గరుండి చూస్తున్న రైతులు చెబుతున్నారు. రోజుకు ఇద్దరు ఫారెస్ట్ బీట్ గార్డులు, 8మంది కేర్ టేకర్లు వాటిని నిత్యం అనుసరిస్తున్నారు. వారికి ప్రస్తుతం అధికారులు వేస్తున్న డ్యూటీ సమయాలు కూడా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మధ్యహ్నం 12నుండి మరుసటి రోజు 12వరకు 24గంటలు డ్యూటీ వేసేకంటే 12గంటలు డ్యూటీ వేస్తే మంచి మంచిదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాఅటవీ, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిదులు బృందంగా ఒక్కసారి నష్టపోయిన పంటలను పరిశీలించి న్యాయం చేయాలని ఈప్రాంత రైతులు కోరుతున్నారు. ఎన్నాళ్ళయిన వీటిని తరలించడం ఇప్పుడున్న మార్గదర్శకాలు ప్రకారం సాధ్యం కాదని స్పష్టంగా తెలుస్తోంది.

## మహాప్రస్థానం వాహనం జాడేది?

- నెలలు గడుస్తున్నా నెరవేరని ఎంపీ హామీ...
- ఇబ్బందులు పడుతున్న మృతుల బంధువులు...

విశాలాంధ్ర-బెలగాం : వైసిపి ప్రభుత్వం అధికారంలో కొచ్చి నేటికి నాలుగేళ్ళు అవుతుంది. ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వారివారి పనులు చేసుకుంటూ పోతున్నారు. కాని పార్వతీపురం ప్రాంతానికి చెందిన అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారనడానికి ఆమె ఇచ్చిన నెరవేర్చకపోవడమే నిదర్శనం. ఈ ప్రాంతానికి మృతదేహాలను ఉచితంగా తరలించేందుకు మహాప్రస్థానం వాహనం మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది. ఎంపీ గారూ... పార్వతీపురం ప్రాంతానికి, మహాప్రస్థానం వాహనం ఎక్కడ అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆమె ఇచ్చిన హామీ నెలలు గడుస్తున్నా ఇంతవరకూ నెరవేరలేదు. దీంతో మృతుల బంధువులు మృతదేహాలను తరలించేందుకు అనేక ఇబ్బందులు, వ్యయప్రయాసలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 6నెలలు క్రితం పార్వతీపురం జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పేద ప్రజలు, గిరిజనులకు సంబంధించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినా, ఇతర కారణాల వల్ల మృతి చెందినా ఆ మృతదేహాన్ని ఆసుపత్రి నుండి తమ స్వగ్రామానికి తీసుకుని పోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం అందుకున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అరకు ఎంపీ గొట్టేటి మాధవికి ఫోన్లో మహాప్రస్థానం వాహనం కావాలని అడిగారు. దీనికి స్పందించిన ఆమె వాహనం ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేశారు. కానీ సుమారు 6నెలలు దాటినా ఇంతవరకు వాహనం జాడ లేదు. మహాప్రస్థానం వాహనం లేకపోవడం వలన ప్రైవేటు వాహనదారుల హవా నడుస్తోంది, వారు ఆడిందే ఆట పాడిందే పాటగా వారికి నచ్చిన ధర చెబుతున్నారు. వారు కోరుకున్న ధర ఇస్తేగాని మృతదేహాలను ఆయా గ్రామాలకు తరలించలేని పరిస్థితి నెలకొంటుంది. కొద్దిగొప్పో ఆర్థిక స్తోమత ఉన్నవారైతే పర్వాలేదు కానీ నిరుపేద, దారిద్ర్యరేఖకు దిగువనున్న వారితో పాటు పేద గిరిజనుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం ఏర్పాటు జరిగి నెలలు గడుస్తున్నప్పటికీ జిల్లా ఆసుపత్రికి మహాప్రస్థానం అంబులెన్స్ లేకపోవడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపి మాధవి తన పనులు ఒత్తిడి వల్ల మర్చిపోయారా ఏమిటని ఇప్పటికయినా మహాప్రస్థానం వాహనం సమకూర్చి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## అయ్యన్నను పరామర్శించిన పార్వతీపురం టీడీపీ నాయకులు

విశాలాంధ్ర -పార్వతీపురం రూరల్: మాజీ మంత్రి టిడిపి, సీనియర్ నాయకులు చింతకాయల అయ్యన్న పాత్రుడును ఆది వారం మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బొబ్బిలి చిరంజీవులు తో పాటు పార్వతిపురం టిడిపి నాయకులు నర్సీపట్నం లో ఆయన స్వగ్రామ్ లోనే పరామర్శించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు ను అక్రమంగా అరెస్టు చేశారని దీనికి కోర్టు సరైన సమాధానం ప్రభుత్వానికి చెప్పిందని అన్నారు. టిడిపి నాయకులను ఎల్లప్పుడూ ఎవరినో ఒకరిని అక్రమంగా అరెస్టు చేయడము లేనిపోని కేసులు పెట్టడం తప్ప వేరే పని ప్రభుత్వానికి లేదని అన్నారు. ఏ ఒక్క కేసు కూడా కోర్టులో నిలబడలేదని ఎన్నిసార్లు కోర్టులు మొట్టికాయలు పెట్టిన ప్రభుత్వానికి సిగ్గు అనిపించడం లేదని అన్నారు. ఏదైనా చర్యలు తీసుకోవాలంటే చట్టబద్ధం, రాజ్యాంగం వాటి ద్వారా తీసుకోవాలని అంతేకానీ అధికారం ఉందని లేనిపోని కేసులు పెడితే ఇదేవిధంగా కోర్టులో ముట్టుకాయలు వేస్తారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి మార్చుకొని అక్రమ కేసులు పెట్టడం మానుకోవాలని సూచించారు. ఇటువంటి అక్రమ కేసులకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు భయపడదని అన్నారు. ఈ కార్యక్రమంలో బలిజిపేట మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాల్ అరకు పార్లమెంటు ఉపాధ్యక్షులు కొట్టాపు వెంకట్ నాయుడు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బోను దేవి చంద్రమౌళి వెంకంపేట టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు జాగాన ధనంజయ్ రావు తదితరులు ఉన్నారు.

## చెత్త నుండి సంపద పై ప్రజలకు అవగాహన కల్పించాలి

### మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: చెత్త నుంచి వచ్చే సంపద సేకరణ అనే విషయంపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ వసూళ్లు పట్టణ పారిశుధ్యం త్రాగునీరు క్లాప్ కార్యక్రమంపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యార్డు నుంచి వచ్చే చెత్తను బొబ్బిలి విశాఖపట్నం తరలించేందుకు పాలకవర్గం తీసుకున్న చర్యలను వేగవంతం చేయాలని వీలైనంతవరకు చెత్త సేకరణ సమయంలోనే పొడి చెత్తను తడి చెత్తను వేరు వేరు చేసి బండిల్స్ రూపొందించాలని సూచించారు. పట్టణంలో ప్రజలకు ఇంటిలో తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారు చేసేవిధానంపై మున్సిపల్ కమిషనర్ కల్పిస్తున్న అవగాహన అభినందనీయమన్నారు. ప్రజలు కూడా ఈ విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పవన్ కు భద్రత పెంచాలి

విశాలాంధ్ర-సీతానగరం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు భద్రత పెంచాలని కోరుతూ జనసైనికులు డిమాండ్ చేశారు.ఆదివారం ముందుగా స్తానిక పార్టీకార్యాలయం వద్ద నియోజకవర్గం పరిధిలోని 4మండలాల అనసేన నాయకుల ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు. ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిస్థితులను చర్చించారు.అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్దకు వారంతా చేరుకొని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా ప్రోగ్రామ్స్ కమిటి మెంబర్ అల్లు రమేష్ ,మండల నాయకులు రమేష్, జైశంకర్ ,సత్యన్నారాయణ, శంకర్, శ్రీను, వెంకటరమణ, ప్రసాద్, కిశోర్, భాస్కర్ విశ్వేశ్వరరావు, గణేష్ ,శ్రీను, శంకర్, మని, వీరమహిళలు లక్ష్మి, మని,గోవిందమ్మ జనసైనికులు పాల్గొన్నారు.

## లారీ- బైక్ ఢీకొని యువకునికి గాయాలు

విశాలాంధ్ర-బెలగాం : లారీ మోటార్ సైకిల్ ఢీకొని యువకునికి గాయాలైన సంఘ టన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాడ మండలం కోటిపాం కాలనీకి చెందిన బొల్లా రామకృష్ణ అదే మండలంలోని సివిని గ్రామంలో ఉన్న పొలానికి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా మార్గమధ్యంలో కోటిపాం బ్రిడ్జి పైకి వచ్చేసరికి పార్వతీపురం నుండి కొమరాడ వైపు వస్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈసంఘటనలో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

## అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తిచేయాలి

### ఎమ్మెల్యే జోగారావు



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఇటీవల పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల పలు వార్డులలో అభివృద్ధి నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. నిర్మాణ పనులను స్వయానా పరిశీలించి గుత్తేదారులకు పలు సూచనలు చేయడంతో పాటు నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇ గున్నేశ్వర రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, వైసీపీ సీనియర్ నాయకులు వార్డు ఇంచార్జీలు ఆకుల శ్రీనివాస రావు, సరివిశెట్టి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు మెరువ వెంకట్రావు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## "ప్రజాసంకల్ప యాత్ర' కు ఐదేళ్లు

విశాలాంధ్ర-బెలగాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైసిపి అధినాయకులు, జననేత వైయస్ జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి నేటికి ఐదేళ్లు పూర్తిచేసుకుంది. నాటి పాదయాత్ర, జగనన్న పరిపాలనను మరోసారి ప్రజలకు గుర్తు చేసే విధంగా ఆదివారం నియోజకవర్గం కేంద్రంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో పేదల జీవితాలు మెరుగుపడేలా, విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టడానికి తోడ్పడినటువంటి పాదయాత్ర సరిగ్గా 2017 నవంబర్ 6న ప్రారంభించి 134 నియోజకవర్గాల మీదుగా 2516 గ్రామాలను కలుపుకుని 341 రోజులు పాటు 3,648 కిలోమీటర్లు నడిచి 124 బహిరంగ సభలు, 55 ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి చరిత్ర సృష్టించిన నేత వైయస్ జగన్ అని ఎమ్మెల్యే జోగారావు ఆనాటి పాద యాత్రను గుర్తు చేస్తూ 5 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా పార్వతీపురం నియోజకవర్గం కేంద్రంలో పార్టీ శ్రేణులతో పాటు కలసి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం విగ్రహం వద్దనే కేక్ కట్ చేసి అందరికీ తినిపించి ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద నుంచి పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్రగా డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి అందరి సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోగల ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, జెడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, ఎఎంసి చైర్ పర్సన్, వైస్ చైర్మన్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, ఎఎంసి డైరెక్టర్లు, పిఎసిఎస్ చైర్మన్లు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఇచ్చిన హామీలు 95శాతం అమలు

నెల్లిమర్ల: ప్రజాసంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చారని ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నెల్లిమర్ల మొయిద జంక్షన్ లో ఆదివారం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కేక్ కూడా కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో జగన్మోహన్ రెడ్డి ప్రజల కష్టాలు చూసి వారి సమస్యలను అధికారం చేపట్టాక నెరవేర్చారని చెప్పారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే సలహా సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, నగరపంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజిని, నగరపంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, పార్టీ మండల అధ్యక్షులు చనమల్లు వెంకటరమణ, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడినాయుడు పాల్గొన్నారు.

### రాష్ట్రానికి అత్యుత్తమ సుపరిపాలన

చీపురుపల్లి: దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మండల జడ్పీటీసీ సభ్యులు వలిరెడ్డి శిరీష, మండల సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం, మార్కెట్ కమిటీ చైర్మన్ దన్నాన జనార్దన్, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, పట్టణ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పతివాడ రాజారావు ఈ రోజు చీపురుపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్దఉన్న వైయస్సార్ విగ్రహం వద్ద ప్రజా సంకల్ప యాత్ర 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహానేత దివంగత నేత డాక్టర్ వై.యస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పార్టీ నాయకులుతో కలసి కేక్ ను కట్ చేసి సంబరాలు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైసీపీ అధినాయకులు, జననేత వై.యస్ జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి నేటికి ఐదేళ్లు పూర్తచేసుకున్నది. నాటి పాదయాత్ర మరియు జగనన్న పరిపాలనను మరోసారి ప్రజలకు గుర్తు చేసే విధంగా కార్యక్రమం జరిగింది. మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో పాటు కలిసి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, విగ్రహం వద్దనే కేక్ కట్ చేసి అందరికీ స్వీట్ పంచి ఘనంగా కార్యక్రమం నిర్వహించుకున్నారు. రాష్ట్ర చరిత్రను సృష్టించేలా ఆనాడు సీఎం వైఎస్ జగన్ ప్రతిపక్షంలో చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ద్వారా వేలాది కిలోమీటర్లు నడిచి పేద బడుగు ప్రజల సమస్యలను తెలుసుకుని వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించి అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసి ప్రజలందరి మన్ననలు పొందటం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసి వలిరెడ్డి శిరీష, మండల సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం, మార్కెట్ కమిటీ చైర్మన్ దన్నాన జనార్దన్, కోరాడ నారాయణ రావు, యువనాయకులు బెల్లాన వంశీ కృష్ణ, పట్టణ అధ్యక్షులు పతివాడ రాజారావు, పార్టీ నాయకులు మంగళగిరి శ్రీను, మంత్రి రమణమూర్తి, ఎంపీటీసీ గెరిడి రామదాసు, కోరుకొండ దాలయ్య, కోసిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి కృషిచేద్దాం

### జిల్లా తెలగ సంక్షేమం సంఘం అధ్యక్షులు యజ్జు మురళీకృష్ణ

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన సామాజికవర్గంగా తెలగ సామాజికవర్గం ఉందని,దానిని ఆర్థికంగా ముందుకు తీసుకువెళ్ళేందుకు అందరూ తమ వంతు కృషిచేయాలని జిల్లా తెలగ సంక్షేమం సంఘం అధ్యక్షులు యజ్జు మురళీకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం హొటల్ మయూరలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాదారు. ఒక సామాజిక వర్గం వెనుకబడిరదంటే దానికి ఆయా కటుంబాల పరిస్థితితో పాటు వారిలో ఉన్న సామాజిక అవగాహన కూడా కారణమన్నారు. ఎవరైతేసాటివారి పట్ల ఔదార్యం చూపెట్టి వారికి ఇతోధికంగా సాయం చేస్తారో..వారితో బాటే వెనుక బాటుతనం కూడా పోతుందని భావించి తనవంతుగా సంఘానికి లక్ష రూపాయల విరాళం ప్రకటిస్తున్నాని తెలి పారు. ఒకరు ముందుకువస్తే దానిని సూర్ఫిగా తీసుకుని సంఘానికి ప్రతినిధులు, కార్యకర్తలు కూడా ఆ బాటలో పయనిస్తారని తెలియజేశారు. సమావేశంలో ముఖ్యఅతిధిగా విచ్చేసిన శ్రీకాకుళం తెలగ సంక్షేమ సంఘ అధ్యక్షులు ద్వారపు అజిత్‌కుమార్ మాట్లాడుతూ నిజమైన సంక్షేమ సంఘంగా తెలగ సంక్షేమ సంఘం నిలబడుతున్నాదని దానికి ఉదాహరణే పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడమని అన్నారు. మూడు జిల్లాలో తెలగ కమ్యూనిటీని ఒక త్రాటి పైకి తెచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలన్న సంకల్పంతో కార్యక్రమాలు రూపొందిస్తున్నామని తెలిపారు. తగిన రిజర్వేషన్లు లేక ప్రభుత్వ ఉద్యోగాల్లో చదువుకు తగ్గ స్థాయి ఉద్యోగాలు రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గతంలో విదేశీ విద్య, కాపునేస్తం పథకాలతో కొంతమేర ఆదుకుందని వాటిని మరలా పునరుద్ధరించాలని విజ్ఞప్తిచేశారు.

ప్రభుత్వ ప్రోత్సాహం తీసుకుని..సంక్షేమ సంఘం కూడా దానికి తగిన సాయంతో తెలగ సామాజికవర్గాన్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కాపుసంఘ నాయకులు ఉత్తరాధ్ర తెలగ సంఏమ సంఘ సలమాదారులు పులపా రవీంద్రనాథ్ టాగూర్ మాట్లాడుతూ సమిష్టి కృషితో ఏద్కెనా సాధించవచ్చని...ఐకమత్యంతో నడిచే ఏ సంఘమైనా ఆయా సామాజికవర్గాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తాయన్నారు. కృష్ణదేవరాయు వారసులుగా చెప్పు కుంటూ నేడు రత్నాలు తెచ్చుకోక పోయినా.. ఆర్థిక సమస్యలు అధిగ మించేందుకు విద్య, వైద్య తదితర రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 27 శాతం మంది ఉన్న సామాజిక వర్గానికి రాజకీయ, ఆర్థిక, సామాజిక అస్థిత్వం లేకపోవడం వల్ల నానాటికి వెనుకబాటుతనం మనల్ని వెక్కిరిస్తున్నాదని అన్నారు. ఈ సందర్భంగా 28 మంది పేద విద్యార్థులకు సంఘ ప్రధాన కార్యదర్శి పి.వి.ఎస్.ఎస్.ప్రసాద్ స్కాలర్ షిప్స్ మంజూరు చేశామని తెలిపారు. వాటిని సమావేశంలో అందిస్తున్నామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం సంఘ కార్యదర్శి జగదీష్, కె.అప్పారావు, అంట్యాకుల శంకరరావు, మంగమ్మ, నారాయణరావు, పడాల్ మాధవరావు, వ్యాసరాజ్ నాయుడు ,మురళి, పుప్పాల అప్పలరాజు, డాక్టర్ బి.ఎస్ ప్రసాదరావు పాల్గొన్నారు

## షెడ్యూల్ ఏరియా సాధనకు గిరిజనుల పోరాటం

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: వెలగవలస పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాల్లో షెడ్యూల్డ్ ఏరియా సాధనకు అవగాహన మీటింగ్ ఆదివారం నిర్వహించారు. ఇందులో జగ్గుదొరవలస గిరిజనులు చేస్తున్న పోరాటం గురించి ఆయా గ్రామాల గిరిజనులకు తెలియజెయ్యడమైనది. పార్వతిపురం మండలంలోని షెడ్యూల్డ్ ఏరియా పోరాటం కోసం ఒక భారీ మీటింగ్ ఎర్పాటు నిమిత్తము పంచాయతీల వారిగా మీటింగ్స్ ఎర్పాటు చెయ్యడం జరుగుతుం దన్నారు. ఈ సమావేశానికి కు డి కె పట్నం సర్పంచ్, సీదరపు ఎర్రప్పదొర, వెలగవలస సర్పంచ్, మెల్లిక వెంకయ్య, గిరిజన నాయకులు ఆరిక ప్రభాకర్, మండంగి సుందర్ రావు, సీదరపు రాజు, కెంద్రుక సన్ని బాబు, గిరిజనులు పాల్గొన్నారు.

## నగరపంచాయతీలో రూ.36 కోట్లతో ఇంటింటా కుళాయి పథకం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నగరపంచాయతీలో రూ.36 కోట్ల నిధులతో ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా చేయనున్నట్లు వైసిపి నెల్లిమర్ల నగరపంచాయతీ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు అన్నారు. నెల్లిమర్లలో ఇంటింటా కుళాయి పథకం ట్యాంక్ పనులకు శనివారం చిక్కాల శంకుస్థాపన చేశారు. వైసిపితోనే నగరపంచాయతీ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఇప్పటికే నగరపంచాయతీలో సీసీ రహదారులు, డ్రెయినేజీలు నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లు బూర సుజాత, నాయకులు బూర సత్యనారాయణ, ఇడదీసి శ్రీనివాసరావు, మహంతి అప్పలనాయుడు, మజ్జి గణేష్ పాల్గొన్నారు.

## ఈ ప్రభుత్వాన్ని కూల్చే సమయం దగ్గర్లోనే...

### జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆదాడ

విశాలాంధ్ర-విజయ నగరంటౌన్ : జగన్మో హన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తొందరలోనే కూల్చి వేసే సమయం ఆసన్న మైందని జనసేనపార్టీ సీనియర్ నాయకుడు ఆదాడ మోహనరావు అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక బాలాజీ జంక్షన్ వద్దనున్న అంబేత్కర్ సామాజిక భవనంలో జనసేనపార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాడ మాట్లాడుతూ జనసేనపార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు పార్టీ సభకు ఇప్పటం గ్రామస్తులు స్థలాన్ని ఇచ్చిన పాపానికి ఆగ్రామంలో నూటా ఇరువై అడుగుల రోడ్ల విస్తరణ పేరుతో ఇళ్లల్ని కూల్చి విధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటం గ్రామస్తులను శనివారం పరామర్శకు వెళ్ళినప్పుడు పవన్ ను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, రాష్ట్రంలో గుంతలు పడిన రోడ్ల మరామత్తుల కోసం ఈమధ్యనే గుడ్ మార్నింగ్ సిఎం కార్యక్రమాన్ని జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెద్దయెత్తున చేశామని, రోడ్లపైన గుంతలు కప్పటం చేతగాని ప్రభుత్వానికి ఓ చిన్న గ్రామంలో కక్షపూరితంగా విధ్వంసం చేయడాన్ని రాష్ట్రంలో ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని, కూల్చి వేతలతో ప్రారంభమైన ఈ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలందరూ కూల్చివేసే సమయం ఆసన్నమైందని దుయ్యబట్టారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు (బాలు),పిడుగు సతీష్, కోయ్యాన లక్ష్మణ్ యాదవ్, లోపింటి కళ్యాణ్, ముక్కి కుమార్ పాల్గొన్నారు.

## ప్రజల హృదయాలను దోచుకునేలా పరిపాలన

విశాలాంధ్ర-గజపతినగరం : ప్రజల హృదయాలను దోచుకునేలా ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని జడ్పిటిసి తౌడు మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రావు లు అన్నారు. ఆదివారం గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ విగ్రహానికిమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలు కంటే ఇంకా ఎక్కువ పనులు చేపట్టారని అన్నారు ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సామంతుల పైడి రాజు మండల సురేష్ కరణం ఆదినారాయణ జి సత్యనారాయణ కర్రి నానాజీ తదితరులు పాల్గొన్నారు

## చదవడం వల్ల విజ్ఞానం కలుగుతుంది

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని గరుగుబిల్లి శాఖ గ్రంధాలయం నిర్వాహకులు నల్ల మధుసూదన రావు అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని జిల్లా గ్రంధాన్ని సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు నిర్వహించి పలువురు విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. విద్యార్థులకు క్విజ్ ఆటల పోటీలను నిర్వహించారు ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించడానికి నిత్యం పుస్తకాలతో చదువుతూ ఉండాలన్నారు. కథలు, రచనలు, దేశభక్తి నాయకుల చరిత్రలు, శాస్త్ర సాంకేతిక రంగాలకు సంబంధించిన పుస్తకములు చదవడం వల్ల విజ్ఞానం కలుగుతుందన్నారు. విద్యార్థులు నిరుద్యోగ యువత నిత్యం పుస్తకాలు చదివినట్లయితే ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. గ్రంథాలయంలో వీటన్నింటిని సంబంధించి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విధంగా సద్వినియోగం చేసుకోవడం వలన ఉద్యోగ ఉపాధి అవకాశాలను కూడా పొందవచ్చని దీంతో ఆర్థికంగా సామాజికంగా ఎంతగానో అభివృద్ధి చెందడానికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరవస్తు చెన్నై సూరి రచించిన పంచతంత్ర కథలు విద్యార్థి చదవగా విద్యార్థిని విద్యార్థులు విని ఉన్నారు, క్విజ్ పోటీలు క్రీడల పోటీలు జరిపితిమి ఈ కార్యక్రమంలో 20 మంది విద్యార్థులు, గరుగుబిల్లి శాఖ గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు పాల్గొన్నారు.

## జామి ఆనకట్ట వద్ద రెవెన్యూ,పోలీసుల పహారా

విశాలాంధ్ర-జామి: మండలకేంద్రమైన జామి శివారులోని జామి ఆనకట్ట వాటర్ ఫాల్స్‌గా పేరు పొందడంతో పర్యాటకులు అధికంగా వస్తున్నారు. కానీ ఇక్కడ అనేక ప్రమాదాలు జరిగిన నేపథ్యంలో స్థానిక రెవెన్యూ, పోలీసు శాఖలు ఇక్కడ ప్రాంతానికి ఎవరూ రాకుండా నిషేదం విదించాయి. అయినా ఇతర జిల్లాలనుంచి పాఠశాలల విద్యార్థులను సైతం విహార యాత్ర పేరుతో తీసుకువస్తున్న నేపథ్యంలో జామి తహశీల్దార్ జె. హేమంత్‌కుమార్ తమ సిబ్బందితో పహారా ఏర్పాటు చేసారు.ఆదివారం మరింత ఎక్కువ మంది వస్తారని గ్రహించి పహారాను కట్టుదిట్టం చేసారు. అలాగే ఆర్ఐ ఉషారాణి, జామి ఎస్ఐ వీరబాబులు ఆనకట్ట ప్రాంతాన్ని పరిశీలన చేసారు. పర్యాటకులకు ఎట్టి పరిస్థితిలోనూ లోపలికి అనుమతించవద్దని సూచించారు. అదే సమయంలో విశాఖనుంచి వచ్చిన ఓ పాఠశాల విద్యార్థుల బస్సును గమనించి వారే స్వయంగా పాఠశాలనిర్వాహకులకు నచ్చజెప్పి పంపించారు.

## వాడవాడలా త్రినాథస్వామి వ్రతపూజలు

విశాలాంధ్ర-సీతానగరం: కార్తీక మాసంలో కార్తీక సోమవారాలకు ఎంతప్రాధాన్యత ఉంటుందో కార్తీక మాసంలోని ఆదివారాలకు కూడా అంతే ప్రాధాన్యత ఉంటుంది. కార్తీక మాసంలో ఆదివారంనాడు వాడవాడలా అన్ని ఇళ్ళల్లో త్రినాథస్వామి వ్రతం చేయడం గమ నార్హం. పున్నమి ముందురోజు ఆదివారంకావడంతో నేడు భక్తిశ్రద్ధ లతో వ్రతాన్ని చేపట్టి పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులంతా కలిసికట్టుగా త్రినాథ వ్రతాన్ని చేయడంవల్ల కుటుంబానికి మంచి జరుగు తుందని ప్రజల నమ్మకం. ఇదిలాఉండగా మండలంలోని జోగమ్మపేట గ్రామంలోగల రిసార్టువద్ద పిక్నిక్ స్పాట్ ఉండడంతోవివిధ ప్రాంతాలు నుండి జనాలు పెద్దఎత్తున తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రంవరకు ఉండి ఆనందాన్ని పొందారు. ఇక్కడ స్విమ్మింగ్ పూల్, ప్రకృతి, పచ్చనిచెట్లు అందరికీ ఆనందాన్ని ఇస్తాయి.ఇక్కడకు దగ్గరలోని సువర్ణముఖి నదిఉండడంతో నదిలో స్నానాలకు కూడా వివిధ ప్రాంతాలనుండి పెద్దఎత్తున తరలివచ్చారు.

## వృద్ధమిత్ర కోఆర్డినేటర్ కృష్ణమూర్తి సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్ వృద్ధమిత్ర కోఆర్డినేటర్ కె.కృష్ణమూర్తి సేవలు అభినంద నీయమని పలువురు పోలీసు సిబ్బంది, 7వ వార్డు మునిసిపల్ కౌన్సిలర్ బొచ్చ ఆనందరావు అన్నారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్లో కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన బోనెల సోనియా అనే యువతి విశాఖపట్నం ట్రెనింగ్ నిమిత్తం వెళ్లుటకు కృష్ణమూర్తి తన సొంత డబ్బులు పరీక్ష ఫీజు నిమిత్తం రెండు వేల రూపాయలు నగదు, బ్యాగు, ఒక జత బట్టలు ఎస్సై, ఏఎస్ఐల చేతుల మీదుగా అందజేశారు. అలాగే పార్వతీపురం మున్సిపాలిటీ 7వ వార్డు నందమూరి కాలనీకి చెందిన 20 మంది వృద్ధ మహిళలకు దుప్పట్లు, గ్లాసులను మునిసిపల్ కౌన్సిలర్ ఆనందరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఆనందరావు పోలీసు సిబ్బంది మాట్లాడుతూ కృష్ణమూర్తి ప్రతినెల తన వేతనంలో కొంత మొత్తాన్ని పేద ప్రజలకు కేటాయించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కృష్ణమూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని పేదలకు సహాయం చేయాలని కోరారు. ఈ మేరకు చలికాలంలో తమకు దుప్పట్లు అందించినందుకు కృష్ణమూర్తిని పేద వృద్ధ మహిళలు ఆశీర్వదించారు.

## శ్రీకాళికాదేవి ఆశీస్సులు అందరిపై ఉండాలి

### రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: శ్రీకాళికాదేవి ఆశీస్సులు ప్రజలు అందరిపైనా ఉండా లని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అభిలాషించారు. ఆదివారం నగరంలోని దాసన్నపేట ఏనుగు తోటలో వేంచేసియున్న శ్రీ మహా కాళేశ్వర సహిత కాళికాదేవి ఆలయాన్ని బోనాల మహోత్సవ సందర్భంగా దర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కాళికా దేవికి వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల కు శాలువా కప్పి , పూలదండలతో సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీమతి పొంతపల్లి మాలతి, నిర్వాహకులు బోడసింగి ఈశ్వరరావు లు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా అమ్మవారి ఆలయ ఉత్సవాలు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గారు , ప్రజలందరి సహకారంతో ఘనంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈనెల 4 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు 9 వ తేదీ అన్నదానం కార్యక్రమంతో ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల కోలాటం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతనిధులు బొద్దాన అప్పారావ్, పొంతపల్లి గోపి, కందర్ప శ్రీనివాస్ ,పెంకి వెంకట రావు, దొడ్డిగల్ల పైడి రాజు,బాబీ,నక్కాన శ్రీను, దువ్వ శ్యామ్, దువ్వ శ్రీను, కొలిచిన విజయభాస్కర్, నుదురుపాటి రాజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పిఆర్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ జిల్లా కోశాధికారిగా శ్రీధర్

విశాలాంధ్ర-జామి: ఎపి పంచాయతీ రాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం జెడ్‌పి సమావేశమందిరంలో జరిగింది. ఈఎన్నికలలో జిల్లా కమిటీ కోశాధికారిగా జామికి చెందిన శ్రీధర్ పట్నాయిక్ ఎన్నికయ్యారు. రాష్ట్ర సంఘ గౌరవాధ్యక్షులు గోవిందరాజులు, రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఈఎన్నికలు నిర్వహించారు. జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగులంతా హాజరయ్యారు. జిల్లా యూనిట్‌కు సంభందించి అధ్యక్షులుగా కిలపర్తిరమేష్(నెల్లిమర్ల), కార్యదర్శిగా బిఎల్ ప్రకాష్‌రావు(కురుపాం)లు ఎన్నికయ్యారు.

## ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో వార్షిక క్రీడోత్సవాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్టేట్ బ్యాంక్ విజయ నగరం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో వార్షిక క్రీడో త్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక కంటోన్మెంట్ లోగల ఎస్బిఐ శిక్షణ కేంద్రంలో జరిగిన ఉద్యోగుల క్రీడా ఉత్సవాలను ఎస్బిఐ ప్రాంతీయ కార్యనిర్వహణాధికారి విజయ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో తలమునకలయ్యే ఉద్యోగులకు ఈ క్రీడా పోటీలు ఆటవిడుపు గా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. వారిలో దాగివున్న ప్రావీణ్యత ను వెలికితీసి ఉత్సాహాన్ని పెంపొందించడం కోసం క్రీడా, సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలను ప్రతి ఏడాది ఎస్బిఐ నిర్వహిస్తుందన్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా ఆదివారం కేరమ్స్, టేబుల్ టెన్నిస్, చదరంగం, షటిల్ బ్యాట్మెంటన్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు విశాఖపట్నం పరిపాలనా కార్యాలయంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ శిక్షణ కేంద్రం సంచాలకులు సాయిబాబా, నరేష్ కృష్ణ, శ్రీనివాస్, రమేష్, సూర్యలక్ష్మి తోపాటు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు చేసిన ఎన్జీవో నేతలు

విశాలాంధ్ర-సీతానగరం: ఏపి ఎన్‌జిఓ బొబ్బిలి తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ గొల్లు సూర్యనారాయణ, సెక్రటరీ బురిడి రామారావు, వైస్ ప్రెసిడెంట్ గొల్లపల్లి రామారావు అధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంను మండలంలోని పలుకార్యాలయాల్లో నిర్వహించారు.ఇంతవరకు 800మందిని సభ్యత్వ నమోదు చేర్పించినట్లు వారు చెప్పారు. అన్ని కార్యాలయాల్లో, సచివాలయాల్లో ఉద్యోగులు సభ్యత్వం తీసుకుంటున్నారని చెప్పారు.ఇదిలా ఉండగా పంచాయతీ రాజ్ అసోసియేషన్ నేతలు జొన్నాడ విక్టర్, శ్రీనివాసరావు, నారాయణ రావు, కృపాల్ లు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

## తెర్లాం శాఖ గ్రంధాలయంలో చదవడం మా కిష్టం

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో తెర్లాం శాఖ గ్రంధాలయం లో ఆదివారం చదవడం మాకిస్టం కార్యక్రమం లో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసును రిటైర్డ్ ఎం ఈ ఓ ఎం.సత్యన్నారాయణ ఆధ్వర్యం లో నిర్వహించారు.మరియు చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా విద్యార్థులకు కథలు పుస్తకాలు చదివించడం మరియు దేశ భక్తి గేయాలు పాడడం జరిగింది అని స్థానిక గ్రంధాలయ అధికారి సి. హెచ్ కృష్ణ మూర్తి తెలిపారు.

## ఆలయ నిర్మాణానికి 25వేల విరాళం

విశాలాంధ్ర-డెంకాడ: పూసపాటిరేగ మండలం రోల్లి చిప్పాడ గ్రామంలో నూతనంగా నిర్మాణం అవుతున్న అయ్యప్ప స్వామి ఆలయ పీఠానికి నెల్లిమర్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు గ్రామ పెద్దలకు 25వేల విరాళాన్ని అందజేశారు ఈ సందర్భంగా చంద్రశేఖర రావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కార్యకర్తలకు మరియు ఆలయ నిర్మాణాలకు సైతం తన వంతు సహాయం అందజేసున్నానని అన్నారు. కార్యక్రమంలో చేడువాడ మాజీ సర్పంచ్ పసుపులేటి శ్రీనివాసరావు కొయ్య ఎల్లన్న కొయ్య లక్ష్మణరావు సాడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

## అరసబలగ లో పలువురు అయ్యప్ప మాలధారణ

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో అరసబలగ గ్రామం లో అయ్యప్ప మాలలు వేసుకుని అర్ధరాత్రి వేళలో చలికి లెక్కచెయ్యకుండా అయ్యప్ప స్వామి మాలలు వేసుకుని 41 రోజు దీక్ష కొనసాగిస్తున్న అరసబలగ సర్పంచ్ కొరగంజి .సాయిరాం ,రెడ్డి శంకర్ ,యాగటి రాము,అవాల లక్ష్మినారాయణ, మంతిన అఖిల్ ఆదివారం విలేకర్ తో తెలిపారు.

## ప్రజా సంకల్ప పాదయాత్రకు ఐదేళ్లు పూర్తి

విశాలాంధ్ర-భోగాపురం: వైఎస్ఆర్సిపి నాయకులు ఆధ్వర్యంలో జగనన్న ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా పంచాయతీ కార్యాలయం కూడలిలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తలు కేక్ కట్ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 6 న తన ప్రజా సంకల్ప యాత్రను ఇడుపులపాయలోని దివంగత వైస్ రాజశేఖర్ రెడ్డి స్మారకం నుంచి ప్రారంభించి, 2019 జనవరి 9 నాటికి ఇచ్చాపురం చేరుకొని దేశంలోనే ఒక చరిత్ర సృష్టించారన్నారు సుదీర్ఘ పాదయాత్రలో నిత్యం ప్రజల్లోనే ఉంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజల కష్టాలను తెలుసుకొని వారికి "నేను విన్నాను" "నేను ఉన్నాను" అని భరోసాను కల్పించా రన్నారు 14 నెలల కాలంలో పదమూడు జిల్లాలను చుట్టేసి అన్ని వర్గాల ప్రజలను కలుసుకుని వారి కష్టాలు తెలుసుకుని కన్నీరు తుడిచారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పయ్యమ్మ, పడాల భాను, పడాల శ్రీనివాసరావు,ఆళ్ల ఉదయబాబు, సుందర హరీష్, అడపా ప్రసాద్, గోపి, మత్యకార డైరెక్టర్ నరసింహులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## 13వ మహాసభలలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్



విశాలాంధ్ర-వేపాడ: ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ వారుశ్రీకాకుళంలో నిర్వహిం చిన 13వ మహాసభలలో మండలానికి చెందిన డీసీసీబీ చైర్మన్ వేచల పు వెంకట చిన రాము నాయుడు పాల్గొని బ్యాంకుల పురోగతి ఉద్యోగుల సహకారం, వారు ఎదుర్కుంటున్న సమస్యలు రైతులకు డీసీసీబీ అందిస్తున్న రుణాలు పొందే ప్రయోజనాలపై కూలంకుషంగా ప్రసంగించారు. అలాగే ఈ మహాసభలలో మాజీఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, రాష్ట్రంలోని 13జిల్లాల డీసీసీబీ చైర్మన్ లు బ్యాంకు సిబ్బంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పటిష్టతకు ప్రణాళిక

### - జిల్లా కెజిబివి పాఠశాలల బలోపేతానికి మరో అడుగు - ఇప్పటికే సూపర్ 60 తో రాష్ట్రంలోనే ఉత్తమ ఫలితాలు
### - మరో విన్నూత్న కార్యక్రమానికి శ్రీకారం - సమగ్రశిక్షా అదనపు పథక అధికారి డా. వేమలి స్వామి నాయుడు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్ : జిల్లా కస్తూరిభా గాంధీ బాలిక విద్యాలయాల బలోపేతానికి విన్నూత్న కార్యక్రమాలు జిల్లా సమగ్రశిక్షా కృషి చేస్తున్నట్లు జిల్లా సమగ్రశిక్షా అధనపు పథక అధికారి డా. వేమలి స్వామినాయుడు అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆడిటోరియంలో విజయనగరం జిల్లాకు చెందిన 26 కెజిబివి పాఠశాలల ప్రిన్సిపాల్స్, అకౌంటెంట్స్, పిజిటి, సిఆర్టి, ఎఎన్ఎం, ఒకేషినల్, కంప్యూటర్ ఇంస్ట్రక్టర్స్ తో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజిబివి పాఠశాలలలో విద్య పటిష్టతకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని ఆయన స్పష్టం చేసారు. కెజిబివి లో చదువుని అభ్యసించే విద్యార్ధినిలకు క్వాలిటీ విద్యను అందించడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. గత ఏడాది ప్రయోగాత్మకంగా చేపట్టిన సూపర్ 60 ప్రోగ్రాం విజయం సాదించిన విషయం గురుతుచేసారు. సూపర్ 60 కార్యక్రమం కారణంగా రాష్ట్రంలోనే అన్ని కెజిబివిల కంటే జిల్లా కెజిబివిలకు ప్రదమ స్థానం సాదించి రాష్ట్రంలోనే జిల్లా మార్గదర్శకంగా మారడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. వచ్చే 2022-23 విద్యాసంవత్సరంలో 10వ తరగతి ఫలితాలలో జిల్లాలో మరింత ఉత్తమ ఫలితాలు సాదించడానికి ప్రిన్సిపాల్స్, పిజిటి, సిఆర్టిలు ఇప్పటినుంచే ప్లాన్ అఫ్ ఆక్షన్ వేయాలని తెలిపారు. ఇందులో బాగంగా సెమినార్ బేస్డ్ ప్రోగ్రాంను పాఠశాలలో ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. ఇందుకోసం ఇంటర్నల్ మొనోటరింగ్ కమిటిని కూడా నియమించడం జరిగిందన్నారు. ఈ కమిటి జిల్లాలో ఉన్న అన్ని కెజిబివిలు సి గ్రేడ్ విద్యార్థులు లేకుండా ఉంచేందుకు పని చేస్తారని తెలిపారు. ఈ ప్రోగ్రాం కోసం కోసం ప్రతి కెజిబివిలో విద్యార్ధినిలకు రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇందులో ప్రతి రోజు స్టేట్, నేషనల్, ఇంటర్నేషనల్ విషయాలపై విద్యార్ధినిలకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిద్వారా విద్యార్ధులలో సి గ్రేడ్ విద్యార్ధినిలను గుర్తించి వారిని వచ్చే విద్యాసంవత్సరంలో వారు కూడా మంచి మర్కులుతో ఉత్తీర్ణిలు అయ్యేలా తగు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. కెజిబివిల అభివృద్ధి విషయంలో ప్రిన్సిపాల్స్ దే పెద్ద పీఠని అన్నారు. అభివృద్ధి చేయడంలో వారు కష్టపడి పని చేస్తూ మిగిలిన సిబ్బందితో కూడా పని చేయనివ్వాలని తెలిపారు. ప్రిన్సిపాల్ సరైన ఆలోచనలతో నడచినపుడే పాఠశాల కూడా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. సిలబస్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉండాలన్నారు. అలాగే పాఠశాలలో సిబ్బంది సెల్ ఫోన్ వాడకూడదని చెప్పారు. ప్రతి రోజు ప్రిన్సిపాల్ సిబ్బంది యొక్క సెల్ ఫోన్ లను మొబైల్ లాక్ చేయాలని తెలిపారు. సూపర్ 60 ఈ ఏడాది ఇంప్లిమెంట్ చేయడం కోసం ప్రిన్సిపాల్ సూచనలు, సలహాలు ఇవ్వాలని అలాగే మన కెజిబివి సిబ్బందితోనే సూపర్ 60 లో ప్రత్యేక తరగతులు చెప్పట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విజయనగరం, జామి, బొబ్బిలి కెజిబివి పాఠశాలలో సూపర్ 60 క్లాసులు నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్ధినిలకు చదువుతో పాటు పౌష్టికాహరాన్ని అందించడమే కెజిబివిల యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఎపిసి తెలిపారు. విద్యార్ధినిలకు వడ్డించే ప్రతి వంటకంలో నాణ్యత తప్పని సరిగా ఉండేలా చూసుకోవాలని ప్రిన్సిపాల్, అకౌంటెంట్స్ కు సూచించారు. ఇక నుంచి విద్యార్ధినిలకు వడ్డించే బోజలలో ఖచ్చితమైన

కొలత పాటించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎపిసి చెప్పారు. ఇందుకోసం కూర వంటకానికి కూర గిన్నెలు, పాలు కోసం గ్లాసులు ప్రతి పాఠశాలలో ప్రవేశపెట్టటం జరుగుతుందని వివరించారు. అలా ఇచ్చిన గిన్నెలు, గ్లాసుల ప్రకారం వాటి నింపుగా కూర, పాలు వడ్డించాలని సూచించారు. అలాగే ఇండెంట్ వచ్చిన సమయంలో లెక్క సరిగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అకౌంటెంట్, ప్రిన్సిపాల్ లదే అన్నారు. వచ్చిన గుడ్లు, పాలు పై స్టాంప్ లు తప్పని సరిగా వేయాలని వాటిని ఆధారంగా చేసుకుని రికార్డు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ పి. మాలతి పాల్గొన్నారు.